సాక్షి
మెదక్
బుధవారం ׀ 21 ׀ మే ׀ 2025



యువ వికాసం.. ఉపశమనం

యువ వికాసంకు సిబిల్ స్కోర్‌తో సంబంధంలేదని ప్రభుత్వం చెప్పడంతో యువతలో ఆందోళనకు తెరపడింది. వివరాలు 8లో ▸



ముందు చూపే మందు

సాగు పనుల్లో రైతులు ముందుచూపుతో మంచి దిగుబడులు సాధించవచ్చంటున్నారు శాస్త్రవేత్త విజయ్. వివరాలు 8లో ▸



నిప్పు పెడితే ముప్పే


వరికోయగా, మిగిలిన కొయ్యకాళ్లు లేకుండా చేసేందుకు నిప్పు పెడుతున్నారు.

వివరాలు 9లో ▸

ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో సాగు

- 3 లక్షల పైచిలుకు ఎకరాల్లో వరి
- ఈసారి సన్నాలు పెరిగే అవకాశం?
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేత



సాక్షి ఎఫెక్ట్

మెదక్‌జోన్: వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు ఖరారు చేశారు. ఈనెల 19న సాక్షి దినపత్రికలో 'ఖరారు కానీ ఖరీఫ్ ప్రణాళిక' అనే కథనం ప్రచురితం కావటంతో స్పందించిన అధికారులు పంటల ప్రణాళికను సిద్ధం చేశారు. సరిపడ ఎరువులు, విత్తనాలపై ఉన్నతాధికారులకు సైతం నివేదిక అందజేశారు.

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల పంటలు 3,50,164 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అందులో సింహభాగం వరి ఏకంగా 3,05,100 ఎకరాల్లో సాగు కానుంది. 2వ స్థానంలో పత్తి 37,200 ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. వరి, పత్తి పంటలు 3,42,300 ఎకరాల్లో సాగు అవుతుండగా మిగతా 7,864 ఎకరాల్లో మాత్రమే ఇతర పంటలు సాగవనున్నాయి. కాగా గత 2024 వానాకాలం సీజన్‌లో వరి, పత్తితో పాటు అన్ని రకాల పంటలు 3,43,399 ఎకరాల్లో సాగు కాగా ఈ ఏడు 6,765 ఎకరాల్లో అధికంగా సాగవుతుంది. పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాల ప్రణాళికను ఉన్నతాధికారులకు నివేదించారు.

గణనీయంగా పెరగనున్న సన్నాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 వానాకాలం సీజన్ నుంచి సన్నాలు సాగు చేసిన రైతులకు అదనంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో రైతులు సన్నాల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో వరి 3,05,100 ఎకరాల్లో సాగు కానుండగా అందులో 40శాతం సన్నాలను వేసే అవకాశం ఉంది. అంటే 1.20 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అంతే కాకుండా మరో 50 వేల ఎకరాలకు పైగా వరి విత్తనాలను సాగు చేసే అవకాశం లేకపోలేదు. కొంత కాలంగా జిల్లాలో పలు రకాల వరి విత్తన కంపెనీలు రైతులతో సాగు చేయిస్తున్నారు. ఒక్కో ఎకరాకు రూ. 70 వేల నుంచి రూ.లక్ష వరకు సదరు కంపెనీలు రైతుకు ఇచ్చి సాగు విత్తనాలను పండిస్తున్నారు. దీంతో రైతులు విత్తనాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టితో కానీ పంటలు దెబ్బతింటే సదరు కంపెనీ రైతుతో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పరిహారం అందజేస్తారు. దీంతో రైతులు వరి విత్తన సాగును విరివిగా పండిస్తున్నారు.

వర్షాధారంగానే పత్తి సాగు

వానాకాలం అత్యధికంగా సాగయ్యే పంటల్లో పత్తి పంట రెండవది. జిల్లా వ్యాప్తంగా 37,200 ఎకరాల్లో సాగు అవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇది ఎక్కువగా జిల్లాలోని పెద్దశంకరంపేట, రేగోడు, అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాల్లో సాగవుతుంది. ఈ పంటను పూర్తిగా వర్షాధారంగా సాగు చేయటం గమనార్హం. సాగు చేసే రైతులకు పంట చేతికందే వరకు నమ్మకం ఉండదు. అతివృష్టి, అనావృష్టితో పాటు పంట చేతికందే దశలోనూ వర్షం కురిస్తే పత్తి నల్లబడి పోయే ప్రమాదం ఉంది. ఈ పంట సాగు చేయటానికి ప్రధాన కారణం సరైనా సాగునీటి సౌకర్యం లేక పోవడమేనని రైతులు చెబుతున్నారు.

పంటల సాగు	ఎకరాల్లో..
వరి	3,05,100
పత్తి	37,200
మొక్కజొన్న	2,640
కందులు	1,500
పెసర్లు	1,500
మినుములు	550
జొన్నలు	100
రాగులు	40
ఆముదం	120
సోయాబీన్	140
చెరుకు	50
నల్లజొన్నలు	60
కూరగాయలు	708
ఆయిల్ పామ్	456

విత్తనాలు	క్వింటాళ్లు
వరి	91,530
పత్తి	(ప్యాకెట్స్) 74,400
కందులు	90
మొక్కజొన్న	264
జొన్నలు	6
మినుములు	33
పెసర్లు	90
ఎరువులు	**మెట్రిక్ టన్నుల్లో**
యూరియా	25,000
డీఏపీ	1,912
ఎంఓపీ	2,118
కాంప్లెక్స్	28,400
ఎస్ఎస్‌పీ	615

న్యూస్‌రీల్

24న కన్వెన్షన్ సెంటర్ లీజు వేలం

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన కన్వెన్షన్ సెంటర్ (ఫంక్షన్ హాలు) లీజు ఇవ్వడానికి ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్ పేర్కొన్నారు. నెలవారీ అద్దె ప్రతిపాదికన వేలం నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనేవారు ముందస్తుగా రూ.3వేలు దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు ఈనెల 21 నుంచి 23 లోపు రూ. 60 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదని, నెగ్గిన వారు వారం రోజుల్లో ఆరు నెలల అద్దె ముందస్తుగా చెల్లించాలని కార్యదర్శి పేర్కొన్నారు. వివరాలకు 99513 37591 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చాకరిమెట్ల ఆలయం వద్ద వేలం



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకాల కోసం మంగళవారం వేలంపాట నిర్వహించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శ్రీనివాస్ సమక్షంలో వేలం పాట నిర్వహించగా ఐదుగురు పాల్గొని.. 10 లక్షల 50 వేల వరకు పాడారు. గత ఏడాది 12 లక్షల 60 వేల వరకు వేలం ద్వారా ఆలయానికి ఆదాయం వచ్చిందన్నారు. సరైన ధర రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 27న బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, సిబ్బంది రామకృష్ణ, వెంకటరెడ్డి, గ్రామస్తులు నర్సింగరావు, నరేందర్, వెంకటేష్, దశరథ్, పాపయ్యచారి, వీరాస్వామి, హరిసింగ్, శంకర్‌గౌడ్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కొందరు విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లైసెన్సు ఉన్న వ్యాపారులవద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో డీలర్లు ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

వెనువెంటనే అన్‌లోడింగ్..



రైస్‌మిల్‌లో అన్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్స్‌కు వస్తున్న ధాన్యాన్ని వెనువెంటనే అన్‌లోడింగ్ చేయాలని డీసీఎస్‌ఓ సురేష్‌రెడ్డి, డీఎం జగదీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని దొంతిలోని కామాక్షి రైస్‌మిల్‌కు ఇతర మండలాల నుంచి 30 లారీల ధాన్యం రావడంతో ఇబ్బందులు తలెత్తడంతో ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఆర్‌ఐ కిషన్ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డీసీఎస్‌ఓ సురేష్‌రెడ్డి, డీఎం జగదీశ్‌కుమార్ దొంతి రైస్‌మిల్‌ను మంగళవారం పరిశీలించారు. ధాన్యం వెంటనే అన్‌లోడింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రమాదాల నివారణ ఇలా..

ఢిల్లీ సదస్సులో కలెక్టర్



ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: రోడ్డు భద్రత నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత– ప్రమాదాల నివారణపై ఢిల్లీలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకున్న చర్యల గురించి ఆయన వివరించారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఇంజినీరింగ్ అధికారులు పాటించేలా రాష్ట్ర, జాతీయ స్థాయిలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ సూచించారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగొద్దు

హౌసింగ్ పీడీ మాణిక్యం



నూతన ఏఈలతో మాట్లాడుతున్న పీడీ మాణిక్యం

మెదక్‌జోన్: ఇందిరమ్మ పథకంలో ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బిల్లులు అందించే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ పీడీ మాణిక్యం అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఔట్‌సోర్సింగ్(ఓటీఎస్) ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులు ఎంపిక చేసిన ఏఈలు జిల్లాకు 11 మందిని కేటాయించారు. మంగళవారం వారితో ఆయన సమావేశం నిర్వహించి పలు మండలాలను కేటాయించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగించడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించేలా ఎంబీ రికార్డులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ యాదగిరి పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు తప్పనిసరి

డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయులు శిక్షణ సమయంలో బోధనలో మెలకువలు నేర్చుకోవాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఫర్ ప్రైమరీ టీచర్స్‌కు 5 రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెదక్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎడ్యుకేషనల్ సెక్రటరీ అధికారి జూమ్ మీటింగ్‌లో పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ శంకర్, ఆర్పీలు, మండలంలోని ఎల్ఎఫ్ఎల హెచ్ఎంలు, ఎస్‌జీటీలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధిపై సామాజిక తనిఖీ

- రూ.21,911 రికవరి, రూ.20 వేల జరిమానా
- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు వెల్లడి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. మంగళవారం నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీపీఓ శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల వారీగా పనుల వివరాలతో పాటు అవకతవకలు వివరించారు. బీమ్‌రావుపల్లిలో సీనియర్ మెట్ నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యుల పేరుతో పనిచేసినట్లు మస్టర్‌లో రాశారని, జప్తిశివనూర్‌లో ఆదివారం కూడా పనిదినాలు కల్పించినట్లు రికార్డు చేసినట్లు వివరించారు. వల్లూర్‌లో పనిచేసిన వారికి డబ్బులు చెల్లించలేదని, నార్సింగిలో ఏడు రోజులు పనిచేసిన 162 మందికి డబ్బులు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు నష్టపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ సిబ్బంది నుంచి రూ.21,911 రికవరి పెట్టామని, రూ.20 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దామోదర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజేశ్వర్, సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ తిరుపతి, హెచ్ఆర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిందూర్‌ను విమర్శించేవారు మూర్ఖులు

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: ఆపరేషన్ సిందూర్‌ను విమర్శించే మూర్ఖులకు ప్రజలే బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గుల్షన్ క్లబ్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు త్రివర్ణ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. హిందువులను టార్గెట్ చేస్తూ భర్తలను చంపి వారి భార్యల నొదుట సిందూరం తుడిచిన ముష్కరులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన సమాధానమే ఆపరేషన్ సిందూర్ అని పేర్కొన్నారు. భారతదేశం ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో ప్రపంచానికి మన సైన్యం సత్తా ఏంటో సిందూర్ ద్వారా చూపించిందన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో అసంఘటిత రంగ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తున్నారని, 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు బాలనర్సు, సాయిలు, శౌకత్ అలీ, హలీమ్, రాజు, కృష్ణ, కుమార్, కొమరయ్య, గట్టయ్య, రెడ్డి, అమృత, బాలమ్మ, రాజు, మల్లేశం, యాదగిరి, కృష్ణ, మైపాల్, షాకీర్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు బీమా పొందాలి

జూనియర్ సివిల్ జడ్జి ఎం.హేమలత



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఎం.హేమలత

నర్సాపూర్ : అసంఘటిత కార్మికులు ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో లభించే బీమాను పొందాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం.హేమలత అన్నారు. మంగళవారం స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద వారు న్యాయ సహాయం అవసరమైతే మండల లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా సహాయం పొందవచ్చని సూచించారు. లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో భూ సమస్యను పరిష్కరించిన అనంతరం తాజాగా రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాన్ని రైతు అశోక్‌కు ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పెండింగ్ కేసులపై పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీటీవీల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, ఎఆర్ డీఎస్పీ రంగానాయక్, టౌన్ సీఐ నాగరాజు, సీఐ రేణుక, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

జిల్లా కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి వరప్రసాద్



కౌడిపల్లి: బచావో ర్యాలీలో పాల్గొన్న వరప్రసాద్, రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి తదితరులు

కొల్చారం(నర్సాపూర్)/కౌడిపల్లి(నర్సాపూర్): పార్టీ కోసం పనిచేసే వారికి కాంగ్రెస్‌లో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని జిల్లా సంస్థ గత ఎన్నికల ఇన్‌చార్జి వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మండలంలోని గ్రామశాఖ అధ్యక్షుల ఎన్నికల కోసం చేపట్టిన నామినేషన్ల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మతతత్వాన్ని ముందుకు తీసుకువచ్చి అధికారం దక్కించుకోవాలనే నైజం బీజేపీదని, ప్రాంతీయ వాదం పేరిట భావోద్వేగాలు రెచ్చగొట్టే మరో పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు సంవిధాన్ బచావో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వరప్రసాద్‌తోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి నాయకుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కాగా కౌడిపల్లి మండల కేంద్రంలో పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి వరప్రసాద్‌తోపాటు టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి తదితరులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు శేషసాయి రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనిల్, సావిత్రి రెడ్డి, కౌడిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకుడు క్రిష్ణాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వెస్ చైర్మన్ చిన్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌ పోస్టులు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా సరిహద్దులలో ఏడు చెక్‌ పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల రవాణా విషయంలో వెటర్నరీ వైద్యుల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌ పోస్టులు నిరంతరం పోలీసుల పర్యవేక్షణలో ఉంటాయన్నారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్టల వారీగా సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆమె ఆదేశించారు.

తప్పిపోయిన మహిళ మృతదేహమై లభ్యం


మల్లవ్వ (ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): రెండు నెలల కిందట తప్పిపోయిన మహిళ అడవిలో అస్థి పంజరమై కనిపించిన ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం అటవీ ప్రాంతంలో మంగళవారం వెలుగు చూసి ంది. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్‌ కథనం మేరకు.. నిజాంపేట మండలంలోని రజాక్‌పల్లి గ్రామానికి చెందిన వజ్జె బాల మల్లవ్వ(54) మార్చి 13న మండలంలోని భగీరథపల్లిలోని బీరప్ప జాతరకొచ్చి తప్పిపోయింది. మహిళ మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఎక్కడికో వెళ్లిపోయింది. మరుసటి రోజు 14న బాధితురాలి కుమారుడు వజ్జె శ్రీరామ్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం సూరారం అటవీ ప్రాంతంలో మానుకుంట బండ రాళ్ల వద్ద కుళ్లిపోయిన మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి పరిశీలించి మల్లవ్వగా గుర్తించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆల్ఫాజోలమ్‌ పట్టివేత

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ మండలం నెంటూరులో ఓ ఇంటిపై మంగళవారం జిల్లా ఎక్సైజ్‌ టాస్క్‌ ఫోర్స్‌ అధికారులు దాడి చేశారు. సోదాలో 330 గ్రాముల ఆల్ఫాజోలమ్‌ దొరికినట్లు ఎక్సైజ్‌ అధికారులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా ఎక్సైజ్‌ అధికారుల ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్‌ అధికారులు, సీఐలు కే.శ్రీధర్‌, బ్రహ్మానంద రెడ్డి, ఎస్‌ఐలు సాయికృష్ణ, శ్రీనివాస్‌, హెచ్‌సీలతో కూడిన బృందం నెంటూరులోని గౌరయ్యగారి ప్రకాశ్‌గౌడ్‌ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ.3,30,000 విలువైన చేసే 330 గ్రాముల ఆల్ఫాజోలమ్‌ దొరికింది. ప్రకాశ్‌గౌడ్‌ను విచారించగా దానిని రాయపోలు మండలానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఆల్ఫాజోలమ్‌ను సీజ్‌ చేశామని, ప్రకాశ్‌గౌడ్‌తోపాటు సత్యనారాయణను అరెస్ట్‌ చేసి కరీంనగర్‌ జైలుకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

యువ వికాసం.. ఉపశమనం

సిబిల్‌ స్కోర్‌ సంబంధం లేదన్న ప్రభుత్వం
- నిరుద్యోగుల్లో తొలగిన ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా 51,657 మంది దరఖాస్తు

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో తలపెట్టిన 'రాజీవ్‌ యువ వికాసం' పథకానికి క్రెడిట్‌ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారనే వార్తల నేపథ్యంలో యువతల్లో నెలకొన్న ఆందోళనకు ప్రభుత్వం తెరదించింది. దరఖాస్తు దారుల సిబిల్‌ స్కోర్‌ తక్కువగా ఉన్నవారికి రుణాలు ఇవ్వరన్న ప్రచారాన్ని కొట్టి పారేస్తూ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క రాజీవ్‌ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు సిబిల్‌ స్కోర్‌తో సంబంధం లేదంటూ ఇటీవల ప్రకటించారు. ప్రభుత్వ ప్రకటనతో నిరుద్యోగ యువతలో నెలకొన్న ఆందోళనకు తెరపడినట్లు అయ్యింది. – నారాయణఖేడ్‌



రాజీవ్‌ యువ వికాసంలో భాగంగా సిబిల్‌ స్కోర్‌ను ప్రమాణికంగా తీసుకుంటే బ్యాంకు లావాదేవీలు జరిపే వారికే పథకం వస్తుందని, ఇందులో పేద నిరుద్యోగులైన అర్హులకంటే అనర్హులకే లబ్ధి చేకూరే అవకాశాలు ఉంటాయని ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపికకు సిబిల్‌ స్కోర్‌, ట్రాక్‌ రికార్డు, రికవరీ లాంటి అంశాలు ఏవీ పరిగణలోకి తీసుకోరని స్పష్టం చేసింది. గతంలో ఎస్సీ, బీసీ, ఐటీడీఏ తదితర సంస్థల రుణాలు పొందిన వారు ఉన్నారని, రాజీవ్‌ యువ వికాసంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించింది. గతంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందని నిరుద్యోగ యువతకు పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. దీంతో జిల్లాలోని నిరుద్యోగుల్లో సంతోషం నెలకొంది.

భారీగా దరఖాస్తులు..

జిల్లాలో ఊహించని విధంగా భారీ స్థాయిలో యువత నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకంలో రూ.50 వేలు మొదలు కొని రూ.4 లక్షల వరకు రుణం పొందేందుకు నిర్ణయించారు. గత నెల 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించగా 51,657 మంది దరఖాస్తులను సమర్పించారు. అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకు గాను 23,681 దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ విభాగంలో 7,415 యూనిట్లకు 14,480 దరఖాస్తులు, మైనార్టీ విభాగంలో 2,456 యూనిట్లకు 8,378 దరఖాస్తులు, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232 దరఖాస్తులు, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించారు.

జూన్‌ 2 నుంచి చెక్కుల పంపిణీ..

ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్‌ 2 నుంచి చెక్కులు పంపిణీ చేయనున్నారు. మండల, మున్సిపల్‌ స్థాయిల్లో అధికారులు గత నెలాఖరు నుంచి దరఖాస్తుల వెరికేషన్‌ ప్రక్రియను చేపట్టారు. జాబితాను కలెక్టర్‌ నేతృత్వంలోని కమిటీకి అధికారులు సిఫారసు చేయనున్నారు. ఈ నెలాఖరులోగా జాబితాలో ఉన్న వారిని మరింత వడబోసి కలెక్టర్‌ ఆధ్వర్యంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారుల జిల్లా కమిటీ ఎంపిక చేయనున్నారు. రూ.50 వేల లోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కేటగిరీ–1లో చేర్చారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష మధ్య ఉన్న దరఖాస్తుల దారులను కేటగిరీ–2లో, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ–3గా, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ–4లో చేర్చారు. కేటగిరీ 1 కింద వందశాతం రాయితీతో రూ.50 వేల రుణం మంజూరు చేయనున్నారు.

ముగ్గురు యువకులు బలవన్మరణం

వేర్వేరు చోట్ల మంగళవారం ఒక్కరోజే ముగ్గురు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్థిక సమస్యలతో ఉరేసుకొని ఇద్దరు, కడుపునొప్పి భరించలేక మరో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మద్యానికి బానిసై..

సిద్దిపేటకమాన్‌: మద్యానికి బానిసై ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన జువ్వన్న లక్ష్మీ, కుమారుడు రాజేశ్‌(28)తో కలిసి స్థానికంగా నివాసం ఉంటుంది. లక్ష్మీ భర్త అనారోగ్యంతో మూడు నెలల కిందట మృతి చెందాడు. రాజేశ్‌ పెయింటర్‌గా పనిచేస్తూ రోజు మద్యం తాగి వచ్చి తల్లి పనికి వెళ్లడం లేదని ఆమెతో గొడవపడుతుండేవాడు. సోమవారం రాత్రి మరోసారి గొడవ పడటంతో తల్లి కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో రాజేశ్‌ వారి ఇంటి ఎదుట నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

జిన్నారం (పటాన్‌చెరు): కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ భరత్‌భూషణ్‌ కథనం మేరకు.. గుమ్మడిదల మున్సిపాలిటీ అన్నారం ఇందిరమ్మ కాలనీకి చెందిన గోల్కొండ సాయి (23) కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కడుపునొప్పి సమస్య మొదలైంది. ప్రతీ నెలా నగరంలోని గాంధీ ఆస్పత్రికి వెళ్లి చూయించుకుంటాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది 19న సాయంత్రం వారు నివాసముండే పూరి గుడిసెలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు నరేశ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వట్‌పల్లి(అందోల్‌): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అందోల్‌ మండల పరిధిలోని సంగుపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. నారాయణఖేడ్‌ పట్టణానికి చెందిన బానాపురం రాకేశ్‌ (27) సంగారెడ్డిలో నివాసం ఉంటూ పాశ మైలారంలో ఓ ప్రైవేట్‌ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం ఇంటికి వెళ్తున్నానని మా అమ్మను నువ్వే చూసుకోవాలని ఫ్రెండ్‌కు చెప్పి అక్కడి నుంచి బయలుదేరి వచ్చాడు. మంగళవారం సంగుపేట రహదారి బ్రిడ్జి సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ముక్తాబాయ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

డ్రైవర్‌ మృతి


బోల్తా పడిన డీసీఎం

హత్నూర(సంగారెడ్డి): బీర్‌ కాటన్ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్‌ మృతి చెందాడు. ఈ ఘటన హత్నూర మండలం చందాపూర్‌ బస్‌స్టేజి సమీపంలో సంగారెడ్డి–నర్సాపూర్‌ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పుల్కల్‌ మండలం శివ్వంపేట గ్రామ శివారులోని బీర్‌ ఫ్యాక్టరీ నుంచి బీర్‌ కాటన్ల లోడుతో కరీంనగర్‌ లిక్కర్‌ డిపోకు డీసీఎం వెళ్తుంది. డీసీఎం ఒక్కసారిగా చందాపూర్‌ గేటు సమీపంలోని వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ ప్రవీణ్‌(22) మృతి చెందగా క్లీనర్‌ ముజామిద్‌ ప్రాణాలతో బయటపడ్డాడు. బాధితులు ఇద్దరూ కర్ణాటక రాష్ట్రం బీదర్‌ జిల్లా చింతకి గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న ఎక్సైజ్‌ ఎస్‌ఐ సందీప్‌ రెడ్డి, ఎస్‌ఐ శ్రీధర్‌ రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లను పరిశీలించి పంచనామ నిర్వహించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని కంటైనర్‌


బోల్తా పడిన కంటైనర్‌

హుస్నాబాద్‌: డివైడర్‌ను ఢీకొని కంటైనర్‌ బోల్తా పడిన ఘటన హుస్నాబాద్‌ పట్టణంలోని బస్టాండ్‌ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి జిల్లా పరకాల నుంచి సంగారెడ్డి పేపర్‌ మిల్లుకు బుధవారం అర్ధరాత్రి ఇసుక కంటైనర్‌ వెళ్తుంది. మార్గమధ్యలో హుస్నాబాద్‌ పట్టణంలోని బస్టాండ్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. డోర్‌ అద్దాలు పగులగొట్టుకొని డ్రైవర్‌, క్లీనర్‌ బయటకు దూకారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

హుస్నాబాద్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, కారు


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హుస్నాబాద్‌రూరల్‌: ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హుస్నాబాద్‌ మండలం జిల్లెలగడ్డలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌ గ్రామానికి చెందిన బానోతు రాజు, లలిత కుటుంబం కరీంనగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇద్దరు కుమారులు ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు అశోక్‌(20) గట్లనర్సింగాపూర్‌ గ్రామానికి నాయనమ్మను చూసేందుకు వచ్చి తిరిగి కరీంనగర్‌ వెళ్తున్నాడు. మార్గమధ్యలో జిల్లెలగడ్డ దగ్గరకు రాగానే హుస్నాబాద్‌ నుంచి హన్మకొండకు వెళ్తున్న కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయ్యి డ్రైవర్‌ అశోక్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేశ్‌ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం పంచనామా చేస్తున్న పోలీసులను మృతుడి బంధువులు అడ్డుకున్నారు. ప్రమాదానికి కారణమైన వారిని తీసుకొచ్చి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ హుస్నాబాద్‌ ప్రభుత్వాస్పత్రి ఎదుట రోడ్డుపై ధర్నాకు దిగారు. కారు యజమానికి పోలీసులు ఫోన్‌ చేయగా ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. వాళ్లు వచ్చే వరకు పోస్టుమార్టం చేసేది లేదని భీష్మించి కూర్చోవడంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోనే భద్రపరిచారు.

కారు ఢీకొని వాచ్‌మెన్‌

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అలిరాజ్‌పేట సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అలిరాజ్‌పేట గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు(65) పీఎస్‌ఆర్‌ గార్డెన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం నిర్మల్‌నగర్‌ ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉండటంతో వెళ్లాడు. అన్నం తిని సైకిల్‌పై తిరిగి గార్డెన్‌కు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై నర్సింలు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌ తెలిపారు.

టీవీఎస్‌ ఎక్సెల్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


రాములు మృతదేహం

వట్‌పల్లి(అందోల్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం అందోల్‌ మండల పరిధిలోని అన్నాసాగర్‌ గ్రామ శివారులో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌ గ్రామానికి చెందిన దానంపల్లి రాములు (52) టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై జోగిపేట వైపు వస్తున్నాడు. అన్నాసాగర్‌ శివారులో ఎదురుగా వచ్చిన సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆర్టీసీ డ్రైవర్‌ జె.లింగయ్య అజాగ్రత్తగా బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య తుల్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆర్‌వీఎంలో అరుదైన శస్త్ర చికిత్స


వివరాలు వెల్లడిస్తున్న సీఈఓ శ్రీనివాస్‌రావు, ఆస్పత్రి సిబ్బంది

ములుగు(గజ్వేల్‌) : మండలంలోని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రి వైద్యులు మంగళవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రి సీఈఓ శ్రీనివాస్‌రావు కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌ మండలం ఇటిక్యాలకు చెందిన తాడూరి యాదగిరి(65) ఇటీవల ఒక శుభకార్యంలో భోజనం చేస్తూ త్రిభుజాకారంలో ఉన్న ఎముకను మింగాడు. ఆ ఎముక గొంతు ద్వారా అన్నవాహిక వద్దకు వెళ్లి నిలిచిపోయింది. దీంతో కడుపునొప్పి, శ్వాసపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటుండటంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. స్పందించిన వైద్యులు శ్రీనివాస్‌, అభిషేక్‌, గోపికృష్ణ, వరుణ్‌, భావన యాదగిరికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఎముకను గుర్తించారు. సమస్య పరిష్కారానికి గ్యాస్ట్రోస్కోపీలో నూతన సాంకేతికను వినియోగించి ఓజీఏస్కో చికిత్స ద్వారా వైద్యులు సురక్షితంగా ఎముకను తొలగించారు. ఆపరేషన్‌ విజయవంతం కావడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోలోనే డ్రైవర్‌ మృతి


ఆటోలో ప్రవీణ్‌గౌడ్‌ మృతదేహం

రామాయంపేట(మెదక్‌): ఆటోలో నిద్రించిన డ్రైవర్‌ అందులోనే మృత్యువాత పడ్డ ఘటన మంగళవారం రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌కు చెందిన ప్రవీణ్‌గౌడ్‌ (35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం ఆటోలో రామాయంపేటకు వచ్చిన ప్రవీణ్‌గౌడ్‌ ఎల్లమ్మ గుడి వద్ద బండి నిలిపి అందులోనే నిద్రించాడు. ఉదయం చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య అఖిలతోపాటు ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.


సొమ్మొకడిది.. సోకొకడిది


రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న రెడ్డిపల్లి పంచాయతీ ట్రాక్టర్‌ ట్యాంకర్‌

అల్లాదుర్గం(మెదక్‌): ప్రభుత్వ సొమ్ము ప్రైవేట్‌ వ్యక్తులకు వరంగా మారింది. ప్రభుత్వం మంజూరు చేసిన పంచాయతీ ట్రాక్టర్‌, ట్యాంకర్‌ను ప్రైవేట్‌ వ్యక్తులు వాడుకుంటున్న ఘటన మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామానికి చెందిన వ్యక్తి అల్లాదుర్గం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద విందు చేసుకున్నారు. అక్కడ నీళ్ల అవసరం ఉంటాయని పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌, ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. పేదలు ఎవరైనా నీటి కోసం అడిగితే ఇవ్వని అధికారులు, ప్రైవేట్‌ వ్యక్తులు తీసుకెళ్తే నోరు మెదపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కార్యదర్శి కుమార్‌ను ప్రశ్నించగా అల్లాదుర్గంలో నీటి కొరత ఉండటంతో, గ్రామానికి చెందిన వ్యక్తి తీసుకెళ్లినట్లు చెప్పారు. పంచాయతీకి చెందింది కదా ప్రైవేట్‌ వ్యక్తులకు ఎలా ఇచ్చారని అడిగితే తీసుకుపోతున్నారు ఏం చేయమంటారు అని సమాధానం ఇవ్వడం గమనార్హం. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముందు చూపే సాగుకు మందు

వేసవి దుక్కులతో రైతులకు ఎంతో మేలు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు
- అధిక ఎరువులతో అనర్థాలు
- వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త విజయ్‌




దుబ్బాకలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

దుబ్బాకటౌన్‌: మరి కొన్ని రోజుల్లో వానాకాలం సాగు పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే రైతులు ప్రణాళికబద్ధంగా సాగుకు సిద్ధమైతే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌ రైతులకు సూచిస్తున్నారు. తొలకరి చినుకులు పడే వరకు వేచి చూసి పనులు ప్రారంభించడం కంటే నెల రోజుల ముందు నుంచే సాగుకు సన్నద్ధమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పంట సాగుకు ముందు నుంచే ఖర్చులను లెక్కించుకోవాలి. పెట్టుబడులకు అనుగుణంగా విత్తనాలను, కూలీలు, ఎరువులు కొనుగోలుకు వ్యయాన్ని సమకూర్చుకోవాలి.

వేసవి దుక్కులు కీలకం..

వానాకాలం సాగుకు నెల రోజుల ముందు నుంచే పంట చేలను చదును చేసి దుక్కులు దున్ని తొలకరికి ముందే విత్తు కోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంట కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడ పురుగులను నివారించొచ్చు. అంతే కాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం వల్ల మంచి దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది.

పత్తి మొద్దళ్లను భూమిలో కలపడం

ఏటా పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి మొదళ్లను కోసి తగల బెడుతుంటారు. పత్తి మొదళ్లు వృథాగా పోకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటవేటరుతో కలియ దున్నాలి. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చు.

భూసార పరీక్షలు

భూమిలో సారం ఎంత వరకు ఉంది. ఎలాంటి విత్తనాలు ఎంచుకోవాలి, ఎంత మోతాదు ఎరువులు వాడాలి అనే విషయం గ్రహించేందుకు భూసార పరీక్షలు కీలకం కానున్నాయి. అధిక దిగుబడికి పోటీ పడి నష్టాలు కొని తెచ్చుకోవడం కంటే భూసార విలువలు తెలుసుకొని కాలానుగుణంగా సాగుతీరు మార్చుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధించొచ్చు. ఇసుక నేలు, ఒండ్రు నేలలు, రేగడి నేలలు, బంకమట్టి నేలలు, నీరు నిలిచే నేలలు, తదితర నేలలకు అనుగుణంగా పంట విత్తుకోవడంతో ఆశించిన దిగుబడి పొందవచ్చు. రైతులు మూడు పంటలకొకసారి భూసార పరీక్షలు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సేంద్రియ ఎరువులు

సేంద్రియ ఎరువులు నేలలో కుళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను పంటలకు అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవ గుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్ల, గొర్రెలు, వానపాముల ఎరువును ఎకరానికి సుమారు 2 నుంచి 4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20 నుంచి 25 రోజుల ముందే సేంద్రియ ఎరువులు వేసి భూమిలో కలియ దున్నాలి. సేంద్రియ పదార్థం వాడటం వల్ల భూమి గట్టి పడకుండా గుల్లగా ఉంటుంది. నీరు బాగా ఇంకటం వల్ల తేమ గణనీయంగా పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.

నాణ్యమైన విత్తనాలు

పంట సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. దాదాపు 38 సంస్థలు వందల రకాల విత్తనాలను మార్కెట్‌లో సిద్ధంగా ఉంచుతున్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతుంది. ఏటా ఏదో ఒక కంపెనీ విత్తలనాను వేసుకునే కంటే నాణ్యమైన విత్తలనాలకు రైతులే విత్తనోత్పత్తికి తోడ్పడితే మేలు.

ఇద్దరు అదృశ్యం

షాపునకు వెళ్లి బాలుడు


గోపాల్‌ జెన

జిన్నారం (పటాన్‌చెరు): బాలుడు అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌ రెడ్డి కథనం మేరకు.. బొల్లారం చర్చి బస్తీలో నివాసముండే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సురేంద్ర జెన కుమారుడు గోపాల్‌ జెన (14) 7వ తరగతి చదువుతున్నాడు. 19న మధ్యాహ్నం షాపునకు వెళ్లొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 87126 56729, 87126 61841 గల నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి


గణేశ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధి దొంతిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోత్రాల గణేశ్‌ మస్కట్‌ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సెల్‌ఫోన్‌ ఇంట్లోనే పెట్టి వెళ్లడంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం గణేశ్‌ భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.